సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం | 26 | మే | 2023



టన్ను చీనీ రూ.36 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.36 వేలు, కనిష్టంగా రూ.12 వేలు, సరాసరిన రూ.21 వేల ప్రకారం పలికాయి.



28న సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష
ఈనెల 28న అనంతపురంలోని 8 కేంద్రాల్లో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ-2023 పరీక్ష జరగనుంది.
8లో

గరిష్టం/కనిష్టం
40.2°/22.8°
జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగానే ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలిక పాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

518 మంది విద్యార్థుల గైర్హాజరు

రాప్తాడు రూరల్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షలకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 518 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని 77 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షకు 11,527 మంది విద్యార్థులకు గాను 11,115 మంది హాజరయ్యారు. 412 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 2,174 మందికి గాను 2,065 మంది విద్యార్థులు హాజరయ్యారు. 106 మంది గైర్హాజరయ్యారు.

రైతులకు నాణ్యమైన విత్తనం



విత్తన నాణ్యతను పరిశీలిస్తున్న ఆవుటాల రమణారెడ్డి

కదిరి అర్బన్: ఖరీఫ్‌లో రైతులకు నాణ్యమైన విత్తనం అందిస్తామని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన వ్యవసాయ సలహామండలి సభ్యుడు సుధీర్‌రెడ్డితో కలిసి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని శివసాయి వేరుశనగ విత్తన శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. విత్తన కాయల ప్రాసెసింగ్ విధానం, నాణ్యత గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రమణారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం శుద్ధి చేసిన నాణ్యమైన విత్తనాన్నే ప్రభుత్వం రాయితీతో రైతులకు అందిస్తోందన్నారు. రైతులు ప్రైవేటు వ్యాపారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

'ముద్ర' రుణాలు సద్వినియోగం చేసుకోండి

- చేనేతలకు అవగాహన కల్పించిన జౌళిశాఖ ఏడీ రమేష్



మాట్లాడుతున్న చేనేత జౌళిశాఖ ఏడీ రమేష్

ధర్మవరం: చేనేత కార్మికులు ముద్ర రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని చేనేత జౌళిశాఖ ఏడీ రమేష్ సూచించారు. గురువారం పట్టణంలోని టీచర్స్‌కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో చేనేత కార్మికులకు ముద్ర పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీతో మార్జిన్ మనీ సౌలభ్యంతో ముద్ర రుణాలు పొందే విధానాన్ని ఈ సందర్భంగా ఏడీ వివరించారు. 20 శాతం మార్జిన్ మనీ, ఆరు నుంచి ఏడు శాతం వరకు వడ్డీ రాయితీ పొందే అవకాశం ఉందన్నారు. ఏడీఓ విజయానంద్, వార్డు సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, జింకా కంబగిరి పాల్గొన్నారు.

పూడికతీతతో చెరువులకు పూర్వ వైభవం



బూర్లకుంటలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామాంజనేయులు

గాండ్లపెంట: పూడికతీతతో చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి వాటికి పూర్వ వైభవం వస్తుందని డ్వామా పీడీ రామాంజనేయులు తెలిపారు. 'అమృత్ సరోవర్' పథకం కింద మండల పరిధిలోని మలమీదపల్లి గ్రామ సమీపంలోని బూర్లకుంటలో చేపట్టిన పూడికతీత పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పూడికతీత మట్టితో కట్టలు పదికాలాలపాటు పటిష్టంగా ఉంటాయన్నారు. గట్లు బలహీన పడే ఆస్కారమే ఉండదన్నారు. పూడిక మట్టిని రైతులు పొలాలకు తరలించుకుంటే భూమి సారవంతం అవుతుందని తెలిపారు. ఉపాధి హామీ పనులకు ఎక్కువ సంఖ్యలో కూలీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోజువారీ కూలి రూ.272 పడేలా మార్కింగ్ ఇచ్చి పనులను చేయించాలన్నారు. పనుల వివరాలు రెండు పూటలా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పండ్లతోటల పెంపకంపై ఆసక్తి ఉన్న చిన్న, సన్న కారు రైతులనుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఎంపీడీఓ అంజినప్ప, ఏపీడీ రెహానాబేగం, ఏపీఓ మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

స్పీడ్ తగ్గించు గురూ..

- ప్రమాదాల నివారణకు పోలీసు ప్రత్యేక యాప్
- అందుబాటులోకి తెస్తున్న అనంత పోలీసులు
- రోడ్లపై బ్లాక్‌స్పాట్స్ ఉంటే ముందే అలర్ట్
- వేగంగా వెళ్తుంటే స్పీడ్ తగ్గించుకోండని సూచన
- వాహనదారులందరికీ ఉచితంగానే సేవలు

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా జిల్లా పోలీసులు ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. తరచూ ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతానికి వంద మీటర్ల దూరంలోనే వాహనదారులను అప్రమత్తం చేసేలా చర్యలు చేపట్టారు. ఉచితంగానే అందించే ఈ సేవలతో రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టొచ్చని పోలీసులు చెబుతున్నారు.







సాక్షి ప్రతినిధి, అనంతపురం: అతివేగం .. నిద్రలేమి వెరసి గమ్యస్థానం చేరకముందే ప్రయాణాలు విషాదంగా మారుతున్నాయి. జిల్లాలో రోజు రోజుకూ పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలు బాధిత కుటుంబ సభ్యులు గుండెలవిసేలా చేస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో జాతీయ రహదారులు ఎక్కువగా ఉండటం వాహనాల సంఖ్య పెరగడం, డ్రైవర్లు కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన ఏటా వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

ముందే హెచ్చరిక...

ప్రధానంగా జాతీయ రహదారుల్లో బ్లాక్ స్పాట్స్ (ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతం) ప్రమాదాలకు ముఖ్య కారణం. ఆ తర్వాత మితిమీరిన వేగం ఈ రెండే ప్రధానమైనవి. అందుకే ఉమ్మడి జిల్లాలో ఎక్కడైతే బ్లాక్‌స్పాట్స్ ఉన్నాయో వాటిని యాప్‌లో చేరుస్తారు. బ్లాక్‌స్పాట్‌కు 100 మీటర్ల దూరంలో ఉండగానే మొబైల్ ఫోన్‌లో అలారం మోగుతుంది. మీ ముందు ప్రమాద హెచ్చరిక ఉంది జాగ్రత్త వెళ్లండి అంటూ వాయిస్ మెసేజ్ వస్తుంది. దీంతో వెంటనే డ్రైవర్ అలర్ట్ అయిపోతారు. బ్లాక్‌స్పాట్ దాటిన 100 మీటర్ల వరకూ ఈ మెసేజ్ వస్తూనే ఉంటుంది.

దిశ యాప్ తరహాలో ..

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అనంతపురం పోలీసులు ప్రత్యేకంగా ఈ యాప్‌ను రూపొందించారు. నాలుగు చక్రాల వాహనాలున్న ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తారు. ఉచితంగా ఈ యాప్‌ను ఇస్తారు. మండల స్థాయిల్లో పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తారు. త్వరలోనే ఈ యాప్ అందుబాటులోకి రానుంది.

ఏడాదిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు	దాదాపు 8500
ఏడాదిలో మృతుల సంఖ్య	దాదాపు 450
బ్లాక్‌స్పాట్స్ సంఖ్య	50కి పైనే..
ఉమ్మడి జిల్లాలో ఉన్న నాలుగు చక్రాల వాహనాలు	దాదాపు 90 వేలు
రెండు జిల్లాల్లోని ద్విచక్ర వాహనాలు	4.20 లక్షలు

వాయిస్ మెసేజ్‌లతో నిరంతరం అప్రమత్తం



వేగాన్ని నియంత్రించేందుకు మరో వాయిస్‌ను కూడా వాడారు. హైవేపై 80 లేదా అంతకు మించి వేగంతో వెళితే వెంటనే మొబైల్ ఫోన్‌లో మీ కుటుంబ సభ్యులు, బంధువులు మీకోసం ఎదురు చూస్తున్నారు. నెమ్మదిగా వెళితే మంచిదంటూ మెసేజ్ వస్తుంది. అధిక వేగంతో వెళ్తున్నంత సేపూ ఈ మెసేజ్ వస్తూనే ఉంటుంది. దీన్ని బట్టి డ్రైవర్లు జాగ్రత్తపడి వేగాన్ని నియంత్రించుకోవాల్సి ఉంటుంది. ఇవే కాకుండా జీబ్రా క్రాసింగ్‌లు, యూటర్న్‌లు, ప్రత్యేక మలుపులు వంటివి వచ్చినప్పుడల్లా ప్రత్యేక వాయిస్ మెసేజ్‌లు మనల్ని అప్రమత్తం చేస్తాయి.

ప్రమాదాల నివారణే ధ్యేయం



"రోడ్డు ప్రమాదాల వల్ల మృతుల , శాశ్వత వైకల్యం పొందిన వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ప్రమాదాల నివారణే ధ్యేయంగా పోలీసు విభాగం తెస్తున్న యాప్‌ను వాహనదారులు వినియోగించుకోవాలి. ఈ యాప్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తాం. వాహనదారులందరికీ ఇది ఎంతో ఉపయోగం.

– ఆర్‌ఎస్.అమ్మిరెడ్డి, డీఐజీ

వాహనదారులు సహకరించాలి



రోడ్డు ప్రమాదాల నివారణకు త్వరలోనే యాప్ తెస్తున్నాం. యాప్ ద్వారా వాహనదారులకు ఎప్పటికప్పుడు మెసేజ్‌ల ద్వారా అలర్ట్ చేస్తాం. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వాహనదారులు సహకరించాలి. కలెక్టర్, ట్రాన్స్‌పోర్ట్ విభాగాలతో సమావేశం ఏర్పాటు చేయబోతున్నాం.

– కె.శ్రీనివాసరావు, ఎస్పీ

తెలంగాణ ఎంసెట్‌లో సత్తా

- మెరుగైన ర్యాంకులు సాధించిన కదిరి విద్యార్థులు



ఫైజా సమ్రీన్



భువనేశ్వర్‌రెడ్డి



కోలాకులం విజేత

కదిరి అర్బన్/తనకల్లు: తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో కదిరికి చెందిన విద్యార్థులు జయభేరి మోగించి ఉత్తమ ర్యాంకులు సాధించారు. పట్టణానికి చెందిన ఫైజా సమ్రీన్ అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగంలో 60వ ర్యాంకు సాధించింది. ఈమె తండ్రి కదిరి మండలం కేఎస్ పాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్‌సైన్స్)గా పనిచేస్తున్నారు. తల్లి నస్రీన్ తలుపుల మండలంలోని ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఫైజా సమ్రీన్ విజయవాడలో శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ చదివింది. వైద్యురాలిగా సేవలు అందించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఫైజా సమ్రీన్ పేర్కొంది.

- కదిరికి చెందిన కొమ్మ భువనేశ్వర్‌రెడ్డి అగ్రికల్చర్ అండ్ మెడికల్‌లో 198వ ర్యాంక్ సాధించాడు. భువనేశ్వర్‌రెడ్డి విజయవాడలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. తండ్రి కొమ్మ ఈశ్వర్‌రెడ్డి తనకల్లు మండలం ఈతోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. తల్లి శ్రీదేవి గృహిణి. గాండ్లపెంట మండలం మునగలవారిపల్లికి చెందిన ఈశ్వర్ రెడ్డి కదిరి పట్టణంలో నివాసముంటున్నారు.
- కదిరి వైఎస్సార్ నగర్‌కు చెందిన కోలాకులం విజేత అనే విద్యార్థిని అగ్రికల్చర్ అండ్ మెడికల్‌లో 492వ ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి ప్రసాద్‌నాయక్.. మిట్టపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పీడీగా, తల్లి అంజనమ్మ గోరంట్ల మండలం పులేరు హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కోలాకులం విజేత అనంతపురం నగరంలో ఇంటర్ చదివింది. పశువైద్యురాలిగా సేవలు అందించాలన్నది తన ధ్యేయమని పేర్కొంది.

దళితులంటే చిన్నచూపెందుకు బాబూ



బైపాస్ రోడ్డు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీ మాధవ్, ఎమ్మెల్సీ ఇక్బాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

- సెంటుభూమిలో సమాధులు కట్టుకోవాలా?
- చంద్రబాబు వ్యాఖ్యలపై 'పురం'లో నిరసన

హిందూపురం: అమరావతి పరిధిలో పేదలు, దళితులు, బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం ఉచితంగా 1.1 సెంటు భూమి ఇచ్చి ఇళ్లు నిర్మిస్తుంటే ఆ స్థలాన్ని శ్మశానంతో పోల్చుతూ శవాలు పూడ్చడానికి, సమాధులు కట్టుకోవడానికి సరిపోతుందంటూ టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై నిరసన పెల్లుబుకుతోంది. చంద్రబాబు తీరును నిరసిస్తూ ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం మున్సిపల్ కార్యాలయ సమీపంలో బైపాస్‌రోడ్డు వద్ద ఆందోళన నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కాలరాచేలా చంద్రబాబు వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. రాజధాని ప్రాంతంలో దళితులకు కూడా చోటు కల్పించాలనే విశాలహృదయంతో వారికి ఉచితంగా 1.1 సెంటు స్థలం ఇచ్చి ఇళ్లు కట్టించాలని సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మకమైన ఆలోచన చేశారన్నారు. అయితే చంద్రబాబు దళితులను చిన్నచూపు చూస్తూ మానవత్వం లేకుండా వ్యాఖ్యలు చేశారన్నారు. రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పెత్తందారులు, ధనవంతులే ఉండాలనేది టీడీపీ అభిమతంగా కన్పిస్తోందని మండిపడ్డారు. రాజధాని ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్థలాలు కేటాయిస్తే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని పచ్చపార్టీ నేతలు కోర్టులో కూడా చెప్పడం వారి కుసంస్కారానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా దళితులను చిన్నచూపు చూడటం మానుకోవాలన్నారు. లేని పక్షంలో రాబోవు రోజుల్లో చంద్రబాబుకు, టీడీపీ నేతలకు దళితులు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జున, నాగేంద్రమ్మ, సునీత, రహమత్‌బీ, అయూబ్, నాయకులు శివ, మోహన్, రాము, సోమశేఖర్‌రెడ్డి, ఇలియాజ్, షఫీ, రహమత్, రమణ, ఆనంద్‌రెడ్డి, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



చాకర్ల పల్లి స్టేషన్ వద్ద నిలిచిపోయిన రైలు

ఆలస్యంగా నడిచిన రైళ్లు

పెనుకొండ: సోమందేపల్లి మండలం రంగేపల్లి వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి పనులు కొనసాగుతుండడంతో బెంగళూరు - గుంతకల్లు మార్గంలో పలు రైళ్ల రాకపోకలు ఆలస్యమయ్యాయి. విషయం తెలియని ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. గురువారం పెనుకొండతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్లలో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి మరికొన్ని రోజులు ఉంటుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

'అకాల' నష్టం రూ.1.15 కోట్లు

- ప్రాథమిక అంచనా తయారు చేసిన అధికారులు
- 186 మంది రైతులకు చెందిన 242 ఎకరాల్లో పంట నష్టం



కనగానపల్లి వద్ద గాలీవానకు నేలకొరిగిన అరటి తోట



బత్తలపల్లి వద్ద దెబ్బతిన్న విద్యుత్ స్తంభాన్ని మారుస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: అకాల వర్షాలు అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీశాయి. ఒకే నెలలో మూడు పర్యాయాలు విరుచుకుపడిన అకాల వర్షాలు పంటలను నేలమట్టం చేశాయి. రైతన్నను అధోగతి పాలు చేశాయి. మే నెలలో గాలీవాన కారణంగా పంటలతోపాటు విద్యుత్ స్తంభాలు కూలి రూ.1.15 కోట్ల నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈనెల మొదటి వారంలో ముదిగుబ్బ, ధర్మవరం, బత్తలపల్లి, గుడిబండ మండలాల్లో 68 హెక్టార్లలో వ్యవసాయ పంటలతో పాటు 11 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. రెండో వారంలో 11,12వ తేదీల్లో పుట్టపర్తి, కొత్తచెరువు, గోరంట్ల మండలాల్లో పెద్ద ఎత్తున గాలీవానకు సుమారు 70 ఎకరాల్లో మామిడి కాయలు రాలి పోయాయి. మామిడి, అల్ల నేరేడు చెట్లు నేల కూలాయి. 4 ఎకరాల్లో అరటి తోట నేలమట్టమైంది. సుమారు రూ.12 లక్షల నష్టం వాటిల్లినట్లు అప్పట్లో చెప్పారు. 86 విద్యుత్ స్తంభాలు విరిగిపడి రూ.20 లక్షలకుపైగా విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. వీటిపై ప్రాథమికంగా అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. మే 22, 23వ తేదీల్లో కనగానపల్లి, ధర్మవరం, తాడిమర్రి, ముదిగుబ్బ, బత్తలపల్లి, లేపాక్షి, హిందూపురం మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ ఆదేశాలతో రైతు భరోసాకేంద్రం సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేశారు. 214 హెక్టార్లలో అరటి పంట దెబ్బతిన్నట్లు, బొప్పాయి, మామిడి, దానిమ్మ, బంతిపూలు, బెండ, చిక్కుడు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. రెండు రోజుల వ్యవధిలో కురిసిన వర్షాలకు 186 మంది రైతులకు చెందిన 242 హెక్టార్లలో పంటలు దెబ్బతిని సుమారు రూ.65 లక్షల మేర నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. ఇక బత్తలపల్లి, ధర్మవరం మండలాల్లో 114 విద్యుత్ స్తంభాలు నేలకొరిగి రూ.15 లక్షల మేర నష్టం వాటిల్లింది. గాలీవానకు ఉద్యాన పంటలతో పాటు విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనాలు తయారు చేశారు.

స్పందన అర్జీలకు మెరుగైన పరిష్కారం

- అభివృద్ధి పనులన్నీ సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు
- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి వివరించిన కలెక్టర్ అరుణ్‌బాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'స్పందన' కార్యక్రమానికి అందిన అర్జీలకు మెరుగైన పరిష్కారం చూపుతున్నామని కలెక్టర్ అరుణ్‌బాబు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డికి వివరించారు. జగనన్నకు చెబుదాం, వైద్యం, ఐసీడీఎస్ పరిధిలోని ప్రభుత్వ పథకాలు, ఎస్‌డీజీ లక్ష్యాలు, పాఠశాల విద్య, గ్రామ వార్డు సచివాలయాలు, స్పందన, గడప గడపకూ మన ప్రభుత్వం తదితర అంశాలపై చీఫ్ సెక్రెటరీ డాక్టర్ జవహర్‌రెడ్డి గురువారం అమరావతి నుంచి వర్చువల్ విధానంలో సమీక్షించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, డీఆర్‌ఓ కొండయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా స్పందన అర్జీలను గడువులోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీ రాజ్ పరిధిలోని సీసీ రోడ్ల నిర్మాణం, ఎస్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ స్తంభాల ఏర్పాటు తదితర సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల చేసేలా చూడాలని కోరారు. వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల పరిధిలో ప్రభుత్వ పథకాలు, ఎస్‌డీజీ లక్ష్యాల పురోగతి, గడప గడపకూ మన ప్రభుత్వం లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేలా అన్ని రకాల చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకరి, డీఈఓ మీనాక్షి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రషీద్‌ఖాన్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రేడ్-2 హెచ్‌ఎంల సీనియార్టీ జాబితా సిద్ధం

ప్రశాంతి నిలయం: జోన్-4 పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కర్నూలు, వైఎస్సార్ ఉమ్మడి జిల్లాల్లోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులకు పదోన్నతుల సీనియార్టీ జాబితా సిద్ధమైంది. జాబితాలను ఆయా జిల్లాల డీఈఓల వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు ఎం. వెంకటకృష్ణారెడ్డి గురువారం తెలిపారు. జాబితా ఆధారంగా 1:2 జనరల్ కేటగిరీ అభ్యర్థులు మాత్రమే ఈనెల 26న కడపలోని ఆర్జేడీ కార్యాలయానికి రావాలని సూచించారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు



మంటలు చెలరేగిన దృశ్యం

మడకశిర రూరల్: మండలంలో గురువారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈక్రమంలో గుర్రపుకొండ గ్రామంలో చిక్కన్న అనే వ్యక్తి ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పండి మంటలు చెలరేగాయి. భారీ శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కొద్దిసేపటి తర్వాత ఇళ్లనుంచి బయటకు వచ్చి మంటలను ఆర్పివేశారు.

GROUP-II
ఉచిత అవగాహన సదస్సు
ఆదివారం (28-05-23) @ 10 AM
సోమవారం కొత్త బ్యాచ్ ప్రారంభం
అనంత భవిత సూర్యనగర్, అనంతపురము. 7997592299

క్లుప్తంగా

కలెక్టర్‌తో బీసీ కమిషన్ సభ్యుడు భేటీ




కలెక్టర్ అరుణ్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కిష్టప్ప

పుట్టపర్తి అర్బన్: కలెక్టర్ అరుణ్‌బాబును ఏపీ బీసీ కమిషన్ సభ్యుడు, విశ్రాంత న్యాయమూర్తి కిష్టప్ప గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అనంతరం జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

టీచర్ల సందేహాల నివృత్తికి కమాండ్ కంట్రోల్ రూం

రాప్తాడు రూరల్: టీచర్ల బదిలీల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ గురువారం వెల్లడించారు. కమాండ్ కంట్రోల్ రూం అధికారులుగా పి.జయచంద్ర (94402 40045), జి.శ్రీనాథ్ (94408 74184), బి.ఆదినారాయణ (94948 36875), పి.మస్తాన్ (83280 57301), పి.ప్రదీప్‌కుమార్ (99481 21966), కె.పార్థసారథి (94948 36893)లను నియమించారు. ఉపాధ్యాయులకు ఏదైనా సందేహం తలెత్తితే వారి నంబర్లకు ఫోన్లు చేసి నివృత్తి చేసుకోవచ్చని డీఈఓ తెలిపారు. ఒకే పాఠశాలలో 5 విద్యా సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన ప్రధానోపాధ్యాయులు, 8 ఏళ్ల సర్వీస్ పూర్తయిన టీచర్లు తప్పనిసరిగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే రీ-అపోర్ట్‌నెంట్ మేరకు సర్‌ప్లస్ అయిన టీచర్లు, సబ్జెక్టు కన్వర్షన్ అయిన స్కూల్ అసిస్టెంట్లు కూడా తప్పనిసరిగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎవరైనా దరఖాస్తు చేసుకోకపోతే సంబంధిత పాఠశాల హెచ్‌ఎం, అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

గ్యాస్ దందా..



- సిలిండర్ 17 రోజులకే అయిందని సోమందేపల్లికి చెందిన వృద్ధ దంపతులు ఏజెన్సీ నిర్వాహకుడిని నిలదీశారు. ఇంట్లో ఇద్దరమే ఉంటామని.. కనీసం నాలుగు నెలల వరకు ఖాళీ కాని సిలిండర్ అంత తొందరగా ఎలా అయిపోయిందో చెప్పాలని నిలదీశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు రూ.500 తీసుకుని మరో సిలిండర్ ఇచ్చాడు. ఈ సంఘటన గత ఏప్రిల్ 24న జరిగింది.
- సిలిండర్ నాలుగు రోజులకే అయిపోయిందని హిందూపురంలో ఓ హోటల్ నిర్వాహకుడు గ్యాస్ డెలివరీ బాయ్‌ను నిలదీశాడు. తనకేం తెలీదని, గోదాములో ఇవ్వగా తాను డెలివరీ చేస్తున్నట్లు సమాధానం ఇచ్చాడు. వెంటనే యజమానికి ఫోన్ చేయగా.. మరో సిలిండర్ ఉచితంగా ఇస్తామని.. ఎవరికీ ఫిర్యాదు చేయొద్దని ఒప్పందానికి వచ్చారు.

... ఇలా హిందూపురం, పరిగి, సోమందేపల్లి, పెనుకొండ, ఓడీ చెరువు మండలాల వరకు తక్కువ తూకం ఉన్న గ్యాస్ సిలిండర్లను గుట్టుగా సరఫరా చేస్తున్నట్లు తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి.

తూకం.. మోసం
- కర్ణాటక నుంచి దిగుమతి
- హిందూపురం కేంద్రంగా ఎంట్రీ
- సోమందేపల్లి వరకు అక్రమ రవాణా
- తూకాల్లో తేడాతో వినియోగదారుల లబోదిబో

సాక్షి, పుట్టపర్తి: గ్యాస్ దందాకు అదుపు లేకుండా పోతోంది. ఇప్పటికే సిలిండర్ ధర పెరిగి అల్లాడిపోతుంటే... తూకాల్లో మోసం నిండా ముంచుతోంది. గ్యాస్ అక్రమ రవాణాకు అలవాటు పడిన కొందరు ఇటీవల కర్ణాటక నుంచి తక్కువ తూకం ఉన్న సిలిండర్లను అక్రమంగా జిల్లాకు తీసుకువచ్చి వినియోగదారులకు అంటగడుతున్నారు. ఇందులో ఎక్కువ భాగం కమర్షియల్ సిలిండర్లు ఉన్నట్లు సమాచారం.

తూకాల్లో దగా..

గృహవినియోగ గ్యాస్ సిలిండర్ మొత్తం బరువు సుమారు 29.9 కిలోలు కాగా, 15.7 కేజీల నుంచి 14.2 కేజీల వరకు గ్యాస్ ఉంటుంది. కమర్షియల్ సిలిండర్‌లో 19 కిలోల గ్యాస్ ఉంటుంది. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల ధరలు ఎప్పటికప్పుడు వెల్లడిస్తారు. కానీ కమర్షియల్ సిలిండర్ ధరలు డిమాండ్‌ను బట్టి మారిపోతుంటాయి. డిమాండ్‌కు అనుగుణంగా కొందరు తక్కువ గ్యాస్ నింపి తక్కువ ధరకే సిలిండర్లు డెలివరీ ఇస్తున్నారు. తక్కువ ధరకు వస్తుందని వాటిని తీసుకుంటున్న వినియోగదారులు కొన్నిరోజుల్లోనే సిలిండర్ ఖాళీ అయ్యాక మోసపోయినట్లు తెలుసుకుంటున్నారు.

రాత్రికి రాత్రే రవాణా..

కర్ణాటక నుంచి రాత్రికి రాత్రే కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు అక్రమంగా జిల్లాలోకి చొరబడుతున్నట్లు ఆరోపణలున్నాయి. స్థానికంగా గిరాకీలను పట్టుకుని ప్రతి వారం సిలిండర్లు సరఫరా చేస్తుంటారు. కొన్ని ఏజెన్సీల్లోని సిబ్బంది కూడా ఈ సిలిండర్లను కొనుగోలు చేసి రెగ్యులర్ వాటితో కలిపి డెలివరీ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాల్లో వంటగది పర్యవేక్షణ ఒకరి చేతుల్లో ఉండదు కనుక గ్యాస్ తూకం మోసం కనుకోవడం కష్టంగా మారుతోంది. అక్కడక్కడా చిరుహోటల్ నిర్వాహకులు కనుగొని ప్రశ్నించినా.. 'మాకేం తెలీదు.. ఇష్టం ఉంటే తీసుకో.. లేదంటే లేదు' అని డెలివరీ బాయ్‌లు చేతులెత్తేస్తున్నారు. డెమెస్టిక్ గ్యాస్ సిలిండర్లలోనూ కేజీ నుంచి రెండు మూడు కేజీల్లోనే తేడా ఉండటం వల్ల వినియోగదారులు కనుక్కోలేకపోతున్నారు.

లోపించిన నిఘా..

హిందూపురం సరిహద్దులో రాత్రిపూట పోలీసు నిఘా లోపించడంతో బొలెరో వాహనాల్లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు అక్రమంగా జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. వినియోగదారులు ఫిర్యాదులు చేస్తున్నా.. తూనికలు - కొలతల అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా వినియోగదారులు బలి అవుతున్నారు. కమర్షియల్ చాటున డొమస్టిక్ సిలిండర్లలో కూడా మోసం జరుగుతోందని.. సోమందేపల్లిలో వినియోగదారుల నుంచి పోలీసులకు ఫిర్యాదులు వెళ్లాయి.

మా దృష్టికి రాలేదు



గ్యాస్ సిలిండర్ల అక్రమ రవాణాపై ఇప్పటి వరకూ మాకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. సరిహద్దులో నిఘా పటిష్టం చేస్తున్నాం. గ్యాస్ సిలిండర్ల అక్రమ రవాణాను ఎట్టిపరిస్థితుల్లో సహించం.

– హిందూపురం రూరల్ సీఐ కృష్ణారెడ్డి

ఫిర్యాదు వస్తే చర్యలు



గ్యాస్ సిలిండర్ల తూకాల్లో తేడాలుంటే ఫిర్యాదు చేయవచ్చు. తనిఖీ చేపట్టి చర్యలు తీసుకుంటాం. తూకాలు తక్కువగా వస్తే ఏజెన్సీ నిర్వాహకులదే బాధ్యత.

– స్వామి, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్

ఇంటి పైనుంచి జారిపడి బేల్దారి మృతి



మృతుడు శంకర్

ధర్మవరం అర్బన్: భవన నిర్మాణ పనుల్లో నిమగ్నమైన బేల్దారి అదుపు తప్పి పైనుంచి కిందపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని మారుతీనగర్‌కు చెందిన శంకర్(58)కు భార్య ముత్యాలమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం ఉదయం స్థానిక టీచర్స్ కాలనీలోని ఓ ఇంటి నిర్మాణ పనుల్లో పాల్గొన్న ఆయన పైభాగంలో పని చేస్తూ అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో తలకు తీవ్రగాయమైన శంకర్‌ను తోటి కార్మికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతిచెందాడు. ఘటనపై ధర్మవరం రెండో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జాతీయ రహదారిపై కంటైనర్ బోల్తా



చిలమత్తూరు: మండలంలోని 44వ జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో గురువారం తెల్లవారుజామున ఓ కంటైనర్ వాహనం బోల్తా పడింది..అనంతపురం వైపు నుంచి బెంగళూరుకు సిమెంట్ లోడుతో వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఒకదాని కొకటి ఢీకొన్నాయి. దీంతో కంటైనర్ బోల్తాపడింది. స్వల్ప గాయాలతో కంటైనర్ డ్రైవర్ బయటపడ్డాడు. నడిరోడ్డుపై వాహనం బోల్తాపడడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని వాహనాలను పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

తండ్రి మృతిని జీర్ణించుకోలేక తనయుడి ఆత్మహత్య



మృతుడు నరేష్

బత్తలపల్లి: తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక ఓ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లికి చెందిన బెస్త చిన్న నారాయణ (45) అనారోగ్యంతో బాధపడుతూ జీవితం విరక్తితో ఐదు రోజుల క్రితం ఊజీ మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. తండ్రి మరణంతో కుమారుడు బెస్త నరేష్ (30) కుదేలయ్యాడు. రోజూ తండ్రితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని బాధపడేవాడు. విషయాన్ని గమనించిన ఆయన భార్య కవిత నచ్చచెబుతూ వచ్చేది. గురువారం ఉదయం తండ్రి ఐదో దినకర్మకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసుకుని వస్తానంటూ బత్తలపల్లికి వెళ్లిన నరేష్... అక్కడ తన బంధువుల ఇంటి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఊజీ మాత్రలు మింగి సెల్‌ఫోన్‌లో వాయిస్ మేసేజ్ చేసి బంధువులకు పంపాడు. వారి నుంచి సమాచారం అందుకున్న కవిత ఆగమేఘాలపై బత్తలపల్లికి చేరుకుంది. అప్పటికే నరేష్‌ను బంధువులు బత్తలపల్లిలోని ఆర్డీటీకి ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి దుర్మరణం



చెన్నకేశవులు (ఫైల్)

ముదిగుబ్బ: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు, జయమ్మ దంపతుల కుమారుడు చెన్నకేశవులు (25) ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. వ్యక్తిగత పనిపై గురువారం ఉదయం కదిరికి వెళ్లి తిరిగి వస్తుండగా ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లి బ్రిడ్జి సమీపంలో వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పట్నం పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

సంప్‌లో పడి కార్మికుడి మృతి

తాడిపత్రి: ప్రమాదవశాత్తు సంప్‌లో పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ప్రసాద్ (43) చుక్కలూరులోని పారిశ్రామిక వాడలో ఉన్న వెంకటేశ్వర స్లాబ్స్ పరిశ్రమలో ఉంటూ అక్కడే కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం నుంచి ప్రసాద్ కనిపించకపోవడంతో యజమాని కృష్ణారెడ్డి ఆరా తీశాడు. దీంతో కార్మికులు గాలింపు చేపట్టారు. పరిశ్రమలోని నీటి సంపు వద్ద ప్రసాద్ చెప్పులు కనిపించడంతో అనుమానం వచ్చి సంప్‌లో పరిశీలించారు. ఓ ప్లాస్టిక్ బిందె నీటిపై తేలియాడుతుండడంతో అనుమానం వచ్చి సంప్‌లో దిగి పరిశీలించగా ప్రసాద్ మృతదేహం కనిపించింది. బుధవారం రాత్రి సంప్‌లోని నీటిని తోడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అదుపు తప్పి అందులో పడి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'నానో' ఎరువులతో అధిక దిగుబడి

- 'ఆత్మ' పీడీ మద్దిలేటి



మాట్లాడుతున్న ఆత్మ పీడీ మద్దిలేటి

అనంతపురం అగ్రికల్చర్: 'ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్స్ కో ఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్కో)' అందుబాటులోకి తీసుకువచ్చిన నానో యూరియా, డీఏపీ ఎరువులు పంట ఉత్పాదక శక్తి, దిగుబడులు పెంచడంలో సమర్థవంతంగా పనిచేస్తాయని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పీడీ మద్దిలేటి తెలిపారు. స్థానిక ఓ ప్రైవేట్ అతిథి గృహంలో గురువారం ఇఫ్కో జిల్లా మేనేజర్ మణికణ్యాణ్ అధ్యక్షతన జరిగిన మార్కెటింగ్ సదస్సులో ఆయన మాట్లాడారు. ఇఫ్కో స్టేట్ మేనేజర్ టి.శ్రీధర్‌రెడ్డి, అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.వెంకటరాముడు, రూరల్ ఏఓ పి.వెంకటేశ్వరప్రసాద్, మార్క్‌ఫెడ్ ప్రతినిధి గీతమ్మ, శాస్త్రవేత్త డాక్టర్ రవికిశోర్, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ప్రస్తుత మార్కెట్‌లో డిమాండ్‌కు తగినట్లు ఎరువులు, యూరియా సరఫరా లేకపోవడం, ధరలు కూడా 50 కిలోల బస్తాకు రూ.1,350 చొప్పున పెరగడంతో రైతులపై పెట్టుబడి భారం పెరుగుతోందన్నారు. ఈ క్రమంలో ద్రవరూపం (లిక్విడ్)లో రూ.600తో 500 మి.లీటర్ల 'నానో' డీఏపీ, రూ.225తో 500 మి.లీ. నానో యూరియాను ఇఫ్కో అందుబాటులో తీసుకువచ్చిందన్నారు. ఈ ఎరువులు అన్ని రకాలుగా రైతులకు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. పంటకు పోషక నాణ్యత, ఉత్పాదకత పెంపొందించడంలో ద్రవరూపంలో ఉన్న నానో డీఏపీ, యూరియా చాలా ప్రభావంతంగా పనిచేస్తాయన్నారు. ఎలాంటి అపోహలు లేకుండా రైతుల్లో అవగాహన కల్పించి నానో ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.

యువతి అదృశ్యం

హిందూపురం: మండలంలోని జూమకులపల్లికి చెందిన 17ఏళ్ల వయసున్న గౌతమి కనిపించడం లేదని తల్లిదండ్రులు అనిత, హనుమంతరాయప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం 12.30గంటలకు హిందూపురంలోని మీ–సేవ కేంద్రంలో పని ఉందని ఇంట్లో చెప్పి వచ్చిన ఆమె.. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

సమాజాభివృద్ధికి దోహదపడేదే కవిత్వం

- 'నజరానా' పుస్తకావిష్కరణలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



పుస్తకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్, తదితరులు

హిందూపురం టౌన్: సమాజంలోని చెడును ఎత్తి చూపి, నవ సమాజ స్థాపనకు దోహదపడేది కవిత్వమేనని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. తపనా సాహిత్య వేదిక, మనోజ్ఞ సాహిత్య వేదిక సంయుక్తంగా గురువారం స్థానిక పెన్షనర్ల భవనంలో కవి ఆచార్య ఎండ్లూరి సుధాకర్ రచించిన నజరానా పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రముఖ రచయిత సడ్లపల్లె చిదంబరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పుస్తక పరిచయాన్ని మైసూరు విశ్వవిద్యాలయం తెలుగు ఉపన్యాసకుడు డాక్టర్ నాగేషు చేశారు. వక్తలు మాట్లాడుతూ.. హృదయ స్పందన లేని చదువు వృథా అన్నారు. కవి, రచయితల్లో అనేక కోణాలు ఉంటాయన్నారు. ఒక పదంతో విప్లవాలను పుట్టించగలరన్నారు. సమాజంలోని చర్యలను, సున్నితత్వాన్ని, ప్రేమతత్వాన్ని, సేవాగుణాలను ప్రేరేపించగలరన్నారు. నిర్వాహకుడు మదన్ మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ ఇక్బాల్ అభినందించి పుస్తకాల ప్రచురణకు రూ.5వేలను విరాళంగా అందజేశారు. స్థానిక మాండలికంలో సడ్లపల్లె చిదంబర్‌రెడ్డి రాసిన పలు పుస్తకాలను కొనుగోలు చేశారు. మరికొన్నింటికి తాను స్పాన్సర్‌షిప్ ఇస్తానని హామీ ఇచ్చారు. వర్తమాన సమాజం గురించి తెలిసిన కవి ఆచార్య ఎండ్లూరి సుధాకర్ అని అన్నారు. సమాజంలోని అనేక కోణాలను తన రచనల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చారన్నారు. ఎన్నో ఉర్దూ కవిత్వాలను తెలుగులో అనువాదం చేస్తూ నజరానా పుస్తకం ద్వారా పరిచయం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు కవులు, రచయితలను సన్మానించారు. కార్యక్రమంలో అల్‌హిలాల్ పాఠశాల హెచ్‌ఎం అక్బర్ షరీఫ్, కవులు, రచయితలు ఏటిగడ్డ అశ్వత్థనారాయణ, సోమశేఖర్, చైతన్య గంగిరెడ్డి, సొంతి జయప్రసాద్, మాడుగుల సులోచనాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

28న సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

- జిల్లాలోని 8 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- హాజరుకానున్న 3,213 మంది అభ్యర్థులు
- అనంత కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 85002 92992

అనంతపురం అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 28న అనంతపురంలోని 8 కేంద్రాల్లో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ–2023 పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ గౌతమి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పరీక్షకు 3,213 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఈ క్రమంలో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టారు. అభ్యర్థులు సౌలభ్యం కోసం ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ పనిచేసేలా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ఏదేని సమాచారం లేదా ఫిర్యాదు కోసం కంట్రోల్ రూమ్ (85002 92992)కు ఫోన్ చేయవచ్చు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఈ కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుంది.

పరీక్ష కేంద్రాలు ఇవే...
- ఎస్వీ డిగ్రీ కళాశాల, జీసెస్‌నగర్
- జేఎన్‌టీయూ(ఏ) కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, శారదనగర్ (సబ్‌సెంటర్– ఎ)
- జేఎన్‌టీయూ(ఏ) కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, శారదనగర్ (సబ్‌సెంటర్– బి)
- కేఎస్ఎన్ ప్రభుత్వ యూజీ, పీజీ మహిళా కళాశాల, ఆర్టీఓ ఆఫీస్ పక్కన, భైరవ్‌నగర్
- ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, జిల్లా పరిషత్ కార్యాలయం దగ్గర
- ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, టవర్‌క్లాక్ దగ్గర
- శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

హిందూపురం: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురంలోని రహమత్‌పురానికి చెందిన నిసార్ అహమ్మద్ కుమారుడు అబూజర్ (20) బుధవారం రాత్రి ఆర్టీసీ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇంట్లో వెల్డింగ్ పనిలో నిమగ్నమయ్యాడు. ఆ సమయంలో ఆర్క్ వెల్డింగ్ గన్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. విషయాన్ని గమనించిన తోటి కార్మికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక అబూజర్ మృతి చెందాడు. ఘటనపై హిందూపురం వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బెదిరింపు కాల్‌పై డీఎంహెచ్‌ఓ ఫిర్యాదు

- డాక్టర్ లక్ష్మీకాంతమ్మ వివాదంలో ఎలాంటి చర్యలుండరాదని హెచ్చరిక
- ఘటనపై పోలీసులకు ఫిర్యాదు

అనంతపురం క్రైం: నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ చేసి గర్భిణి మృతికి కారణమైన డాక్టర్ లక్ష్మీకాంతమ్మ వివాదం మరో మలుపు తిరిగింది. ఈ వివాదంలో తలదూర్చిన ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకుడు నేరుగా డీఎంహెచ్ఓకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. డాక్టర్ లక్ష్మీకాంతపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని హెచ్చరికలు జారీ చేశాడు. దీనిపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి గురువారం మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రి నిర్వహణతో పాటు గర్భిణి మృతికి సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ పూర్తి చేసి, నివేదికను అందజేసినట్లు వివరించారు. ఈ నివేదిక ఆధారంగా డాక్టర్ లక్ష్మీకాంతమ్మ సస్పెన్షన్‌కు కలెక్టర్ సిఫారసు చేశారని గుర్తు చేశారు. అయితే ఎస్సీ, ఎస్టీ సంఘం పేరుతో ఈ నెల 24న ఓ వ్యక్తి తనకు ఫోన్ చేసి బెదిరించడం చాలా బాధించిందన్నారు. తప్పును తప్పుగానే చూడాలన్నారు.

వైద్య సంఘాల సంఘీభావం..

బెదిరింపు కాల్‌పై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మనోరంజన్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ అభిషేక్ రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ నిరంజన్ రెడ్డి, డాక్టర్ ప్రసూన, సహాయ కార్యదర్శి డాక్టర్ వంశీకృష్ణ, విశ్రాంత డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామసుబ్బారావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ కళ్యాణ్‌కుమార్, డాక్టర్ అనుపమ జేమ్స్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీహర్ష తదితరులు స్పందించారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డాక్టర్ వీరబ్బాయిని కలసి తమ సంఘీభావం తెలిపారు. నిబంధనలు ఎవరు అతిక్రమించినా చర్యలు తీసుకుని తీరాల్సిందేనని, లేదంటే వైద్య వృత్తిపై ప్రజలు విశ్వాసం కోల్పోయే ప్రమాదముందన్నారు. అనంతరం బెదిరింపు కాల్ చేసిన ఆగంతకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమి క్యాంప్ కార్యాలయంలో కలసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

పోలీసులకు ఫిర్యాదు..

బెదిరింపు కాల్ విషయమై డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి అనంతపురం రెండో పట్టణ పోలీసులకు గురువారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ట్రూ కాలర్‌లో ఆగంతకుని పేరు సాకే గంగాధర్ అని చూపుతోందన్నారు. అతని సెల్ నెంబర్‌ను ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట డీఐఓ డాక్టర్ యుగంధర్, తదితరులున్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED TEACHERS
LKG to X Class.
Walk in interview from 29-05-23 to 31-05-23
with your original certificates.
V.V. MODEL EM HIGH SCHOOL
[Recognised by Govt. of A.P.]
Rudrampeta, Alamuru Road, Anantapuramu. Cell: 9866194659.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

POLYTECHNIC ADMISSIONS
■ పాలీసెట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో క్వాలిఫై అయిన స్టూడెంట్స్‌కి పాలిటెక్నిక్ కోర్స్ నందు ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర॥ జి.మురళీ, 9030661651, ATP. [A-745504]

PARAMEDICAL
■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1418]

REAL ESTATE

భూమి అమ్మబడును
■ వెంచర్స్‌కు మరియు వ్యవసాయ భూమి అమ్మబడును. మరియు డెవలప్‌మెంట్‌కు ఇవ్వబడును. 5 ఎకరాలు + 2 ఎకరాలు + 55 ఎకరాలు. Contact : 9133294645. [A-745508]

LAND FOR SALE
■ అనంతపురం గార్లదిన్నె మం॥, కల్లూరు (NH.7 1.Km) 7.56 ఎకరములు మరియు హిందూపురం TIDCO అపార్ట్‌మెంట్స్ ఎదురుగా Road Bit 3.32 ఎకరాలు అమ్మబడును. 9343510635, 9493640270. [C-785757]

SERVICES

SUMMER SOLAR OFFER
■ 25 years warranty తో Solar Install చేసుకోండి. మీ Power Bill ను Zero చేసుకోండి. సెల్: 89390 94841, 81795 85242. [A-826]

బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V-6142]

ఉచిత OP చూడ బడును
■ వల్లా హాస్పిటల్ 7 రోడ్ సర్కిల్ నందు గైనకాలజీ విభాగంలో ఉచిత సంతానోత్పత్తి OP శిబిరం 14-05-2023 to 20-05-2023 సంతానోత్పత్తి OP ఉచితంగా చూస్తారు 20% డిస్కౌంట్ తో అన్ని స్కాన్స్ ఇన్వెస్టిగేషన్, సర్జరీస్ చేస్తారు. 9849040158. [C-784737]

BUSINESS OFFER
■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 9034424384. [H-797632]

WANTED
■ మా ఆఫీసులో వర్క్ చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Q: 10th. జీతం : 6,500 to 10,000 + ఇన్సెంటీవ్స్. Cell: 9133223529, 9666983886. [A-745501]

■ ప్రైవేట్ కాలేజీస్‌కి అడ్మిషన్స్ చేయడానికి లేడీ టెలికాలర్స్ కావలెను. వెంటనే సంప్రదించండి సెల్ : 9392840890, తాడిపత్రి. [A-745507]

■ Wanted Typewriting (English & Telugu) qualified Female faculty to work in a Type Institute. Preferable Qualified from Taj T/W Inst. 9392250279. [A-745503]

■ మా కంపెనీ LED బల్బులు మీ ఇంటివద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000- 20,000/- వరకు సంపాదించండి. వివరాలకై సంప్ర: 9000408325 [G-786353]

■ ఫ్రాంఛైజ్ ఆఫర్ (పెట్టుబడి లేదు) మా సంస్థను మీజిల్లాలోఅభివృద్ధి చేయగలిగేవారు కావలెను. Mega Group Man Power & Security. Conact: 70326 10569, 70931 25169. [NA-5620]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221302]

■ అతి తక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్తరికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 7730899503 [G-587]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం : 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786357]

■ ఎర్రచందనం సాగులో అగ్రగామి కంపెనీ నందు ఫామ్ ల్యాండ్స్ మార్కెటింగ్ చేయుటకు అనుభవం గల స్త్రీ / పు కావలెను. అనుభవం లేని వారు కూడా సంప్ర : ✆ 83410 78779 [B-1165733]

■ డైరెక్ట్ జాబ్ 18-50 సం.ల మహిళలు/మా కంపెనీ కొరకు వెంటనే కావలెను. ఉచిత వసతి+భోజనం+ జీతం: 16000-30000 వేల వరకు. స్పాట్ జాయినింగ్. ఫోన్: 7799087387. [H-781493]

■ ప్రముఖ సెక్యూరిటీ ఏజెన్సీ నందు పనిచేయుటకు అనంతపురం, కడప, తిరుపతి జిల్లాల యందు ఫీల్డ్ ఆఫీసర్స్ & బ్రాంచ్ మేనేజర్స్ కావలెను. (Ex.Servicemen Preferable), ✆ 6369898268. [T-1148514]

■ అనంతపురంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ నందు పనిచేయుటకు అనుభవం గల అకౌంటెంట్ కావలెను. ఆసక్తికలవారు adminatp@mahathiinfradevelopers.com కు మెయిల్ ద్వారా CV ని పంపండి. [A-829]

■ WANTED FEMALE candidate for receptionist and pharmacist position with good communication skills at Reputed Ayurveda Hospital, Anantapur. 9440785957 [A-7544]

■ అనంతపురం జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు డెలివరీ బాయ్స్ కావలెను. జీతం: 14,000 నుండి 27,000. పెట్రోల్ + ఛార్జ్ అలవెన్స్ సౌకర్యం కలదు. Q: 10th. క్లాస్. సంప్రదించండి : వరుణ్‌కుమార్ (H.R), సెల్: 7989274184, 8074091675. delhivery.com [A-745509]

■ ఉద్యోగాలు: YMC నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లో జాబ్ చేయుటకు యువతీ, యువకులకు అవకాశం కలదు. Q: 10, ఇంటర్, డిగ్రీ (P/F), Age: 18 to 30. నో ఫీజ్. సెల్: 9177342337. [WA-6969]

■ ప్రముఖ మా సంస్థ 100 ఎకరాల Site నందు మార్కెటింగ్ చేయుటకు యువతీ యువకులు కావలెను. ఫిక్స్ సాలరీ రూ. 12000/- (రూము+భోజనము ఫ్రీ) చదువు 10th to any డిగ్రీ, వయసు 18 to 28సం॥ కన్సల్టెన్సీ కాదు. ఫోన్ : 9966348645 [HA-93483]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY ANANTAPUR
ANANTHAPURAMU - 515 002, (A.P) INDIA
e-Procurement Tender Notice

1	Construction of tub for vermin composting at Mechanical Workshop at JNTUA CEA Ananthapuramu with Tender ID No. 615931.
2	Repairs and providing MS grills in Pharmacy block at JNTUA, OTPRI, Ananthapuramu with Tender ID No. 615929.
3	Painting to Main Entrance and Arch, repairs to toilet block and providing LED streetlight at JNTUA, OTPRI, Ananthapuramu with Tender ID No. 625358.
4	Renovation of Seminar Hall at 1st Floor in Main Building at JNTUA, OTPRI, Ananthapuramu with Tender ID No. 625374.

Further Details can be seen at e-procurement market place i.e., www.tender.apeprocurement.gov.in
Sd/- REGISTRAR